క్లుప్తంగా

ప్రచారానికి వాడామనడం అబద్ధం

వినుకొండ టౌన్‌: ఎన్నికల ప్రచారానికి ఎండీఎం వాహనాలను స్థానిక శాసన సభ్యులు వాడుతున్నారంటూ, ప్రతిపక్ష నాయకులు చేస్తున్న వాదనలను ఎండీఎం ఆపరేటర్లు శనివారం తీవ్రంగా ఖండించారు. పట్టణానికి చెందిన 9 మంది ఆపరేటర్లు తమ వాహనాలతో పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం, టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పేద ప్రజలకు ఇంటి వద్దకే రేషన్‌ సరుకులను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌ రెడ్డి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, తమలాంటి వారికి ఎండీఎంలుగా జీవనాధారం కల్పించడం జరిగిందన్నారు.

ఫొటోగ్రాఫర్‌ మృతి

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు సమీపంలో గల శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందని సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన గోకుల్‌ కృష్ణ వినోద్‌ కుమార్‌(32) నరసరావుపేటలో పని పూర్తి చేసుకొని మోటర్‌సైకిల్‌పై వస్తుండగా ప్రమాదం జరిగింది. అన్నవరప్పాడు సమీపంలోకి రాగానే రోడ్డుపై గేదెలు అడ్డురావటంతో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన కృష్ణ వినోద్‌ కుమార్‌ను వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఈపూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోవడంతో ఇరువురు వ్యక్తులు గాయపడ్డ సంఘటన కొచ్చర్ల చెరువు సమీపంలో శనివారం జరిగింది. బొల్లాపల్లి మండలం వెంకటరెడ్డిపురం తండాకు చెందిన రామావత్‌ వాగ్యానాయక్‌, ఆయన కుమారుడు మణికంఠ నాయక్‌ ఈ ప్రమాదంలో గాయపడ్డారు. కుమారుడు మణికంఠ నాయక్‌ ద్విచక్ర వాహనం నడుపుతుండగా అదుపు తప్పి పడిపోయింది. క్షతగాత్రులను 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మన రాష్ట్రంలోనే అభివృద్ధి

వినుకొండ(నూజెండ్ల): దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బొల్లా మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి చేయాలనే ఆలోచనకు గ్రామ ప్రజలు సహకరించాలని తెలిపారు.

సిద్ధం సభకు సమాయత్తం

వేర్వేరు ప్రాంతాల నుంచి భారీగా తరలివెళ్లేందుకు ప్రణాళిక



చిలకలూరిపేట: నియోజకవర్గం నుంచి సిద్ధం సభకు భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి గుడిపాడులో ఆదివారం సిద్ధం సభ నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం వైఎస్సార్‌ సీపీ శ్రేణులను సిద్ధం చేసేందుకు ఈ సభలో ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌రెడ్డి పాల్గొననున్న నేపథ్యంలో సభకు భారీగా తరలివెళ్లేందుకు వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇప్పటికే ఈ నెల ఏడో తేదీన నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ తదితర నాయకులు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దీంతో పాటు ఈ నెల ఐదో తేదీన వెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్‌ యాదవ్‌ సైతం పాల్గొని సిద్ధం సభను విజయవంతం చేసేందుకు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. సిద్ధం సభకు తరలివెళ్లేందుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి, పట్టణంలోని ప్రతి వార్డు నుంచి బస్సులు ఏర్పాటు చేశారు. దీనికి తోడు వందలాది కార్లలో తరలి వెళ్లేందుకు నాయకు లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల నుంచి వచ్చే కార్యకర్తల కోసం రూట్‌ మ్యాప్‌లను రూపొందించి సంబంధిత నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ వివిధ విభాగాల నాయకులు, ఎవరూ ఏ బాధ్యతలు నిర్వర్తించాలో దిశానిర్దేశం చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌ నాయుడుతో పాటు, నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన చిట్టా విజయభాస్కరరెడ్డి ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే సిద్ధం సభకు సంబంధించి ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మైకుల ద్వారా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు.

సభకు వెళ్దొద్దాం.. 'సిద్ధం'కండి

వినుకొండ(నూజెండ్ల): బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద జరిగే నేడు జరిగే వైఎస్సార్‌ సీపీ సిద్ధం మహాసభకు వేలాది మందిగా అభిమానులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే బొల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సభకు ప్రత్యేక బస్సులు, వాహనాల్లో తరలిరావాలని కోరారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

శావల్యాపురం నుంచి....

శావల్యాపురం: అద్దంకి-మేదరమెట్ల సమీపంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన సిద్ధం సభకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుంచి 60 బస్సులు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ భీమని అంకారావు శనివారం తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సిద్ధం సభలో వైఎస్సార్‌ సీపీ అభిమానులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

■ ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నాదెండ్ల: ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ ఝాన్సీవాణి శనివారం చెప్పారు. మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలోని ఏపీ మోడల్‌ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్‌ 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకు ప్రస్తుతం ఐదో తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. అయితే ఓసీ, బీసీ కేటగిరిలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్‌ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు.

■ నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశపరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌ బి.వెంకటమ్మ తెలిపారు.

కొండ తిరునాళ్ల విజయవంతం



కోటప్పకొండలో ప్రభల వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న రాష్ట్ర మంత్రి విడదల రజిని



కాకాని ప్రభపై మాట్లాడుతున్న పార్లమెంట్‌ సమన్వయకర్త డాక్టర్‌ అనిల్‌కుమార్‌ యాదవ్‌

- ఫలించిన జిల్లా అధికారుల కృషి
- ట్రాఫిక్‌ కష్టాలు నామమాత్రం
- ప్రభలను సందర్శించిన మంత్రి రజిని, ఎమ్మెల్యే డాక్టర్‌ గోపిరెడ్డి, పార్లమెంట్‌ సమన్వయకర్త అనిల్‌కుమార్‌యాదవ్‌

నరసరావుపేట రూరల్‌: కోటప్పకొండ తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన యాత్రికులకు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విజయవంతమైంది. ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ యాత్రికులకు వసతులు కల్పించడంలో జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి, ఎమ్మెల్యే డాక్టర్‌ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలు సక్సెస్‌ అయ్యారు. మహాశివరాత్రి పర్వదినాన శుక్రవారం సుమారు 2.5 లక్షల మందికి త్రికోటేశ్వర స్వామి దర్శనం కల్పించారు. ఐదు క్యూలైన్‌లతో పాటు వీఐపీ, వీవీపీలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో క్యూలైన్‌లోని సామాన్య భక్తులకు మజ్జిగ, తాగునీరు, పాలు, బిస్కెట్లు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్‌, స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌లతో పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవలు అందించాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే తిరునాళ్లలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆలయ ప్రాంగణంతో పాటు పార్కింగ్‌ ప్రాంతంలో వినుకొండ, నరసరావుపేట మున్సిపాలిటి కార్మికులను విధుల్లో నియమించడంతో పరిశుభ్రత కనిపించింది.

ట్రాఫిక్‌ కష్టాలను అధిగమించి..

కోటప్పకొండ తిరునాళ్ల అంటేనే ట్రాఫిక్‌ కష్టాలు గుర్తుకువస్తాయి. లక్షలాది మందితో జాతర జరిగే రాత్రి సమయంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ కిలోమీటర్ల మేర నిలిచిపోతుంది. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ట్రాఫిక్‌ కష్టాలు లేకుండా భక్తులు తిరునాళ్లను చూడగలిగారు. బస్సుల ద్వారా కొండకు వచ్చిన యాత్రికులకు మాత్రం ఎలాంటి అసౌకర్యం కలగలేదు. నరసరావుపేట-కోటప్పకొండ మార్గంలో ఘాట్‌రోడ్డులో కొంత సమయం ట్రాఫిక్‌ నిలిచిపోయింది. పోలీసులు సకాలంలో స్పందించి ట్రాఫిక్‌ క్రమబద్ధీకరించారు. గత అనుభవాలు దృష్ట్యా పలుదారులను వన్‌వే చేయడంతో ట్రాఫిక్‌ సమస్యకు చెక్‌పడింది. తిరునాళ్ల బందోబస్తుకు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించి విజయవంతం కావడంలో పోలీసు శాఖ విజయం సాధించింది.

వైభవంగా లింగోద్భవ పూజలు

పలుచోట్ల శాంతి కల్యాణాలు

జాగరణ చేసి తరించిన భక్తజనం



వినుకొండలో వేడుకలకు హాజరైన భక్తులు

నరసరావుపేట ఈస్ట్‌: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర వారం రాత్రి శైవాలయాల్లో లింగోద్భవ ప్రత్యేక పూజలు, శివపార్వతుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాతూరు శివాలయంలోని శ్రీభీమలింగేశ్వర స్వామి వారికి అర్ధరాత్రి విశేష అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే రావిపాడురోడ్డులోని శ్రీకల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు.

కోటయ్యా... వెళ్లొస్తాం.!

కోటప్పకొండలో జాగరణ చేసిన ప్రభలు తిరుగుముఖం పట్టాయి. రావిపాడు, లింగంగుంట్ల, రాజుపాలెం గ్రామాలకు వెళ్లే ప్రభలు పట్టణం నుంచే శనివారం వెళ్లాయి.

–నరసరావుపేట ఈస్ట్‌







